# శుద్ధ అబద్ధం

ఆవాళ, మిట్టమధ్యాహ్నం, ఉన్నట్టుండి కారు కమ్ముకొచ్చింది. అప్పటినుంచీ, కుండపోతగా వాన ఎడా తెరిపీ లేకుండా పడుతూంది.

ఆ పూట రోజూకన్న పెందరాళే ప్రొద్దుగూకింది. వణుకు పుట్టినట్లు, చీకటి తెరలు తెరలుగా ముంచుకొచ్చి, పొడుచుకున్నా కన్ను కనపడకుండా గుయ్యారంగా ఉంది.

పొరగాడి కడుపు ఏడుస్తాంది. ఈదురుకొట్టి ఆవు ఎగచేపింది. పొయ్యి అంటించి బువ్వ వండుదామంటే చుట్టూ గుడిసె గాలికి ఉండుండి అదిరిపడుతూ, ఎప్పుడు ఎగిరిపోతుందా అన్నట్టు వుంది.

మక్కిలు బిగదీసుకుపోయి - ఆవు, చెట్టుక్రింద మూలుగుతూంది. చంటివాడు ఎక్కిళ్ళు వచ్చేవరకూ గుక్కపట్టి, సొమ్మసిల్లి, మూగన్నుగా తల్లి ఒళ్ళో పడివున్నాడు.

సుబ్బడు కంట్లో వత్తులు వేసుకుని కొంగజపం చేస్తూ కూచు న్నాడు.

వాడికి ఆకలి వేసింది. పిల్లవాడి బొజ్జ తడిమిచూశాడు. రత్తి నవ్వింది. 'పోవే!' అన్నట్టు చూసి -కట్టులోంచి ఓ చొప్పదంటు లాగి, నమలడం మొదలుపెట్టాడు.

పిల్లవాడు మసిలాడు: రత్తి వాడిని రొమ్ముకు ఒత్తుకుని, కాసిని నూకలు కచ్చాపచ్చాగా నమిలి పిల్లవాడినోటికి పట్టింది.

వాళ్ళు కూచున్న మేరా, - తాటాకులు యెగిరిపోయి నాయి: జల్లు వడేసి మొగంమీదికి కొట్టింది. కొంప అంటుకున్నంత మెరుపు మెరిసింది. కరణం గారింట్లో, బిందెలూ, తప్పెలాలూ, అటక మీదనుంచి పడ్డట్టు - ఉరుము ఉరిమింది: ఆవు - అంభా అంది. కట్టుతాడు వదులై, తడిక, భార్లాగా లోపలికి గుద్దుకుంది.

తడికకు కుంది అడ్డంవేద్దామని సుబ్బడు లేచాడు. గుర్రుగుర్రూ మంటూ మట్టిరోడ్డుమీద చప్పుడు దొర్లు కుంటూ వచ్చింది. 'ఎవరురా లోపల' అని పొల్లు కేక విన పడ్డది.

సుబ్బడు బయటికి తొంగి చూశాడు. ఎవరో ఓ కుదిమట్టం - కారు నెట్టుకుంటూ వచ్చారు: ఓ మీసాల ఆసామి. మీసాలతడి దులుపుకుంటూ ముందుకు ఓ అడుగు వేసి 'ఎవరది?' అన్నాడు.

ఒత్తుగా చినుకు పడుతూంది కాని, జల్లు వెలిసింది. సుబ్బడు బయటికివచ్చి 'ఏం అయ్యా!' అన్నాడు.

'ఆ గొడ్డును విప్పేయి - కారు పెట్టాలి' అన్నాడు ఆసామి.

'దానికి నిలవ తావులేదయ్యా! తడిసి తడిసి వుంది. మెరాబాలో విడిస్తే దొమ్మకొట్టిపోతుంది' అన్నాడు సుబ్బడు.

'అంతగాపోతే మరోటి కొనిపెడతాలే - పదివేల రూపాయలకారు పాడై పోతుంది. విప్పేయ్...' అని గదమాయించాడు ఆసామి. సుబ్బడు చిత్తమన్నాడు కిక్కురు మనకుండా.

కారులోంచి అబ్బాయిగారు 'డాడీ!' అని పిలిచాడు. 'ఎస్ బాబ్' అని ఆసామి దగ్గరకు వెళ్లాడు.

'అది 'కౌ' కాదూ!'

'ఎస్ బాబ్.'

'వండర్ ఫుల్ 'కౌ'. మిల్క్ యిస్తుందికాదూ?'

'ఎస్ డియర్!'అన్నది పక్కను కూచున్న అబ్బాయి అమ్మ.

'హౌ నైస్ :— మమ్మీ నాకు మిల్క్ కావాలి.'

'అలాగే బాబ్!' అని తల నిమిరి 'డాలింగ్!' అనీ నాథుణ్ణి కేక వేసింది. ఆసామి సుబ్బణ్ణి కేక వేశాడు.

'మా అబ్బాయిగారికి పాలు కావాలి.'

'లేవు బాబూ.'

'పితుకు.'

'ఇవ్వాదు బాబూ, మా పిల్లగాడికే లేవు.'

'నీ పిల్లగాడికి లేకపోతే మా బాబుకి లేవంటావా? వేషాలుపోక - కావాలంటే ఓ పావలాయిస్తా - పితుకు.'

'డాలింగ్, డాలింగ్! పావలా టూమచ్! టు అనాస్, ఓన్లీ టు అనాస్——' అంటూ విలవిలలాడుతూంది ఆసామి భార్య.

'అమ్మగారూ. టు అనాస్ యిచ్చినా, టు రుపీస్ యిచ్చినా అది పుచ్చుకోదమ్మా! అది డబ్బేం చేసుకుంటుంది తల్లీ. తవురికి ఎరిక లేదేమో కాని, కులంవున్న ఏగొడ్డూ ఏదీ కాని వేళ-చేపదు' అంటూ సుబ్బడు కారు దగ్గిరకు వెళ్లాడు. ఆసామి భార్యకు, కడుపులో తిప్పినంత పనై-ముక్కు-చిట్లించు కుంది. ఆసామి, సుబ్బడిగాలి కారుకు సోకకుండా, అడ్డం నుంచున్నాడు.

'అలా దుంగలా నిలుచుంటాడే-కారు చెట్టు క్రిందకు నెట్టమను, డాలింగ్!' అని కోకిలకంఠంతో హెచ్చరించింది ఆ యమ్మ. మోటారుకారు చెట్టుక్రిందకు చేరింది.

మళ్ళీ గాలి - సాగింది. ఒక్క- విసురుకు మండ విరిగి కారుమీద పడ్డది. లోపల కోకిల కంఠం కెవ్వుమన్నది. బాబ్! యింగ్లీషులో నేచర్‌ను ధారాళంగా తిడుతున్నాడు.

అబ్బాయీ, అమ్మగారూ,- కారుదిగి, గుడిసెలోపలికి వచ్చారు. డ్రైవరు తినుబండారాలపెట్టె లోపలికి జేరవేశాడు.

రత్తి-వచ్చినవాళ్ళను చూసి పిల్లవాణ్ణి భుజాన వేసుకుని లేచి నిలుచుంది. అమ్మగారు రత్తివంక చూసి, - ముక్కు మరింత చిట్లించుకుంది.

ఆసామీ- కోటుతీసి, నేలమీద పరిచాడు. అమ్మగారూ, బాబూ గునుస్తూ కూర్చున్నారు. బాబ్ బిస్కత్తుల పొట్లం చించాడు. అమ్మగారు ఫ్లాస్కుమూత సుతారంగా తిప్పుతూంది.

బాబ్ బిస్కత్తులు తింటున్నాడు. రత్తిచేతికి పిల్లవాడి బొజ్జ గుర్తుకొచ్చింది. 'అమ్మగారూ!' అంది: 'మాపిల్లగాడికి ఓ రెండుముక్కలు 'పడెయ్యండి' అంది. అనీ అనడంతో చెంప ఛెళ్ళుమంది. సుబ్బడు- మరోసారి చేయెత్తి 'శుద్దీ బుద్దీ ఉండక్కర్లా. అవి దొరలు తినేవి. అలాటి మా రాజులు తినేవి...' అని ఉరిమాడు.

'మీరు కొంచెంసేపు బయటికి వెళ్ళండి...' అన్నది అమ్మగారు. సుబ్బడు సకుటుంబంగా, బయటికె నడిచాడు. 'తలుపు దగ్గిరేసిపో! మా డ్రైవర్ని - ఇలా రమ్మను' అన్నాడు ఆసామి. డ్రైవర్ని లోపలికిజేర్చి తలుపు తడికి గట్టిగా కట్టేశాడు సుబ్బడు.

ఉన్నట్టుండి, మళ్ళీ జల్లు ముంచుకొచ్చింది — గుడిసె ఎగిరిపోయేట్టుగా గాలి కొడుతూంది. సుబ్బడు- కారు, చెట్టు క్రిందనుంచి ఆరబయటకు నెట్టి, గోవును పొడిచోట కట్టేసి, సకుటుంబంగా కారులో ఎక్కి తలుపులు వేసుకున్నాడు.

గాలి ఎక్కువైంది. గుడిసె చిందులు వేస్తోంది. ఎప్పుడు కూలుతుందో? - తడికెలాగిచూస్తే - రావడంలేదు. తాడు కోసేందుకు కత్తిలేదు. డ్రైవర్ని తాడుకోరకమన్నాడు ఆసామి. కాని డ్రైవరుది బోసినోరు, అయ్యగారుకోరుకుతూ కూర్చున్నాడు.

బయట వాన కొడుతూంది. కారులో మహా వెచ్చగా ఉంది. ఒకళ్ళ దగ్గిరగా ఒకరు జరిగి కూర్చున్నారు. మరింత వెచ్చగావుంది. అలాగే తెల్లారింది. తెల్లారుతూండగానే వాన వెలిసింది.

సుబ్బడు - ఇక బయటపడదామని తలుపు నెట్టాడు. ఊహుఁ. రాందే! గడియతీయడం తిరకాసు వాడికి తెలియ దాయెను...

పెదవులన్నీ పగిలి, చిగుళ్లరక్తం చిమ్ముతూంటే, - ఆసామీ, - సకుటుంబముగా తాడు నమిలి తడికెవిప్పిన - అనంతరం బయటకి వచ్చాడు. ఒక్క ఉరుకున ఆ కుటుంబం కారుదగ్గిరకు వచ్చిపడ్డది. తలుపులు తీసింది. లోపల సుబ్బడి కుటుంబం ఆదమరచి నిద్రపోతూంది.

బయటవాళ్ళ అరుపులకీ, పెడబొబ్బలికీ- లోపలివాళ్ళు లేచి-కారు దిగారు. 'తపురి ధర్మమా అంటూ పొడిచోట నిదురోయినాం, అయ్యా!' అంటూ సుబ్బడు వినయంగా కళ్లు నులుముకున్నాడు. పిల్లవాడు మెలకువవచ్చి- ఆవులించాడు.

'డ్రైవర్! తలుపులు ఎందుకు లాక్ చెయ్యాలా?'

'లేదుసార్.'

'నిన్ను డిస్మిస్ చేశాను.'

'రైట్‌సార్, నాకు ఈ నెల జీతం - రూల్సు ప్రకారం మూడునెలల బోనస్ ఇప్పించండి సార్.'

'ఇంటికి రా. - చెక్ బుక్ తేలేదు.'

'రైటోసార్, నాకు సొమ్ము ముట్టేవరకూ, అమ్మగారి నగ ఏదన్నా యిప్పించండి. లేకపోతే డిస్మిసల్ ఆర్డరు చెల్లదు.'

రత్తి, సుబ్బడూ చోద్యంగా ఈ మాటలు ఆలకిస్తున్నారు.

'ఏమా తలపొగరు. నీకు దిక్కున్నచోట చెప్పుకో. పో - ఒక్కకానీ యివ్వను.

'రైటోసార్—'

డ్రైవరు వెళుతున్నాడు.

'ఏయ్ డ్రైవర్ !'

'సార్ !'

'కారు తాళాలు ఏవీ!'

'అడగడం న్యాయమా సార్. - డబ్బు యిప్పించండి.

'డ్రైవర్ మమ్మల్ని అధ్వాన్నపు అడవిలో ఇలా యిబ్బంది పెడతావా?' అమ్మగారు కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

'ఇయ్యి బాబూ వారిసొమ్ము వారికియ్యి...' అన్నాడు సుబ్బడు.

'మరి, నా రెక్కల కష్టం -?' అన్నాడు డ్రైవరు -

'ఎక్కడికీ పోదు. కారుకొనుక్కున్న సామంతులు - నీ జీతం డబ్బులు ఎగేస్తారా - యివ్వవయ్యా! - ఆ తల్లి అడిగినందుకే యివ్వచ్చు-' అని బ్రతిమాలాడు సుబ్బడు. డ్రైవరు - యిచ్చేశాడు.

'మావంటి వారి దగ్గర యిన్నాళ్లూ నౌకరీచేసి - చివరకు చెట్టుక్రింద బ్రతికేవాళ్ళ చేత చెప్పించుకునే గతి పట్టిందా నీకు? -'

'బుద్ధులిలా ఉండబట్టే-మీకు పూటకు గతిఉండదు -'

— అయ్యగారూ; అమ్మగారూ ఏకగ్రీవంగా తిట్టి కారు కదిల్చారు -

'ఇదిగో - ఒరేయ్-!' అని ఆసామి సుబ్బణ్ణి కేకవేసి - ఒక బేడ అమ్మగారు అందివ్వగా - సుబ్బడిమీదికి గిరవాటు వేశారు -

సుబ్బడు - నేల పడ్డది - తీసి కళ్ళకు అద్దుకుని -

'ఆహా - ఏం మనుష్యులయ్యా!' అన్నాడు డ్రైవరుతో -

కారు, - ధూకుడుగా నాలుగు బారలు సాగి - ఆగింది. బాబు - 'డ్రైవర్ ! - డ్రైవర్' - అని పొల్లుకేకలు పెడుతున్నాడు.

డ్రైవరు - సుబ్బడివంక చూసి నవ్వాడు - 'మా అయ్యగారికి ఆర్భాటమే కాని, కారు తోలలేరు -'

'అన్నా ! - అన్నా ! - నీకు పున్నెముంటుంది - పెద్ద వారి బుద్ధులు ఎసుమంటి వైతేనేం - లోన పోరగా డున్నాడు - తిన్నగా - తోలుకు పో - అన్నా ! -' అని రత్తి బ్రతిమాలింది - డ్రైవరు - తల్లి మందలించిన పిల్లవాడిలాగా - తలవంచుకు ముందుకు సాగాడు.

'ఒక్కక్షణం కారు నిలుపన్నా - మా మనిషిచేత పాలుతీసి అంపుతా - ఆకలి పడుంటాడు పిల్లగాడు -

'ఇదిగో నయ్యోవ్ పెద్దమణిసీ ! - ఆ బేడకాసెట్టి, కోమటెంటికాడ గొబ్బెరకాయట్టుకురా - కొట్టి సూర్యభగవాన్లకు దణ్ణమెట్టుకుందాం ! - అలాంటి బక్కోళ్లను సల్లగా సూడమని -' అంది రత్తి.